క్లుప్తంగా

కరపత్రాల పంపిణీ

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్పించడానికి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం మండల యూటీఎఫ్ శాఖ ముద్రించిన కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని కరప్రతాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను బడితో చేర్పించడానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అనిర్వచనీయమని ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ కొనియాడారు. యూటీఎఫ్ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, వైవీవీ రమణ, బొంతు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి జాతరను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో పూజీఘటాలతో పాటు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం వద్ద గురువారం తీర్థం ఏర్పాటు చేయనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కామిశెట్టి పండు, గంధ్రోతు శ్రీనివాసరావు తెలిపారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ


కుర్చీలు అందించిన వారితో సర్పంచ్ వల్లీశ్వరి తదితరులు

మలికిపురం: మండలంలోని మేడిచర్లపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం మేడిచర్ల కనక సూర్యప్రకాశరావు కుమారుడు మేడిచర్ల సత్యనారాయణ ద్వారా ఇమామీ అగ్రోటెక్ లిమిటెడ్ నుంచి రూ.25 వేల విలువైన సీల్ కమల్ కుర్చీలు, దేవీ సీఫుడ్స్ లిమిటెడ్ ద్వారా మరో రూ.25 వేల విలువైన సీల్‌కమల్ కుర్చీలను అందించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఒ.సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, రామలింగేశ్వరరావు, ఎంపీటీసీ ముత్యాల సాయిరాం, విద్యాకమిటీ చైర్మన్ ఝాన్సీ పాల్గొన్నారు.

సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం

సఖినేటిపల్లి: ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకూ 61 రోజులు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సముద్రంపై చేపల వేట నిషేధం అమలులో ఉంటుందని రాజోలు ఫిషరీస్ ఏడీ సిద్ధార్థవర్ధన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మెకనైజ్డ్ బోట్లు, మోటరైజిడ్ బోట్లు ద్వారా నిర్వహించే అన్ని రకాల చేపల వేటను ఈ కాలంలో నిషేధిస్తున్నట్టు ఆయన అన్నారు. కాగా చేపల వేట నిషేధం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ, రొయ్య, పీత జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్య, పీతలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం అన్నారు. నిషేధ కాలానికి మత్స్యకారులు, పెద్దలు సహకరించాలని కూడా ఆయన కోరారు.

గర్భిణులకు ఆరోగ్య రక్ష

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ సాయి సీత ఆధ్వర్యంలో ఆరోగ్య సమాజానికి ఆరోగ్య బిడ్డ అనే నినాదంతో గర్భిణుల ఆరోగ్యం కోసం ఆరోగ్య మాతృ రక్ష అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భిణులకు ఆరోగ్యవంతమైన బిడ్డను సులువుగా ప్రసవించడానికి సులువైన వ్యాయామ ప్రక్రియల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పోషక విలువలు కలిగిన పండ్లు, డ్రై ఫ్రూట్స్, బియ్యం, నిత్యవసర సరుకులు, చీరలను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో అను సంస్థ సభ్యులు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఆలయంలో స్వామికి వేదపండితులు గోపూజ, తులసి పూజ, ఆచార్యస్తుతి, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, అజస్రదీపారాధన, మేదినీపూజ, అంకురార్పణ మొదలైన పూజలు జరిపారు. అధిక సంఖ్యలో స్వామిని భక్తులు దర్శించి, స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు.

ప్రకృతి వైపరీత్యాలపై నేడు అవగాహన

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో తుఫానులు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శనివారం టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ, ఇలా అన్ని శాఖలకు చెందిన అధికారులతో నిర్వహిస్తామన్నారు. శనివారం ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందితో మార్క్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తామన్నారు.


రావులపాలెంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు


ముక్తేశ్వరంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


మలికిపురంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గొల్లపల్లి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

- ఘనంగా జ్యోతిరావ్ జయంతి
- విగ్రహాలు, చిత్రపటాలకు నేతల నివాళులు

రావులపాలెం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని కొత్తపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచులు గోవిందకృష్ణారెడ్డి, అర్జునరావు, అంబటి సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: సంఘ సంస్కర్తగా జ్యోతిరావు పూలే సేవలు సూర్యచంద్రులు ఉన్నంత కాలం గుర్తుంటాయని పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అన్నారు. ముక్తేశ్వరం సెంటర్‌లో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పీడిత వర్గాలకు చదువు అవసరమని చెప్పిన మహానుభావుడు పూలే అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, పార్టీ నాయకులు మిండగుదిటి రాంబాబు, మట్టపర్తి వెంకటరమణ, కడలి భూపతిరావు, కాశీ వీరవెంకట సత్యనారాయణ, పినిపే బుజ్జి, నామాడి టైటాస్ తదితరులు ఉన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: స్థానిక పూలే–అంబేడ్కర్ భవనంలో జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు నివాళులర్పించారు. పూలే దంపతులు సమాజంలో రుగ్మతలు తొలగించడానికి చేసిన కృషి గొల్లపల్లి కొనియాడారు. గుబ్బల బాబ్జీ, గుబ్బల మనోహర్, ఈద రవిరెడ్డి, పెదపాటి నాగలక్ష్మి, ఉచ్చుల దాసు, కంచి రమణ పాల్గొన్నారు. సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పూలే, అంబేడ్కర్ భవనంలో బహుజన సమన్వయ సమాఖ్య ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటం వద్ద ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులర్పించారు. డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, గెద్దం తులసీభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మలికిపురంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


కొత్తపేటలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

పాశర్లపూడిలంకలో..

మామిడికుదురు: జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శ్లాఘించారు. పూలే జయంతి సందర్భంగా పాశర్లపూడిలంకలోని విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. అప్పనపల్లిలో విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అప్పనపల్లి కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్‌లో విగ్రహానికి ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, మామిడికుదురు బాలుర వసతి గృహం వద్ద ఉన్న విగ్రహానికి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు ప్రముఖులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.


ఆలమూరులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ తోరాటి, ఎంపీడీఓ రాజు తదితరులు

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు పార్కులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పూలే సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పూలే జయంతిని స్థానిక అక్విడెక్టు పార్కులో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ రాష్ట్ర నాయకులు మందపాటి కిరణ్‌కుమార్, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహారావు, మద్దుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: పూలే జయంతిని కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ పార్కులో పూలే విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు వద్ద పూలే విగ్రహానికి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల పార్టీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మట్టపర్తి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో, బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలమూరులో..

ఆలమూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే స్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పూలే జయంతి నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతిల్లో ఎంపీపీ లక్ష్మణరావు, ఎంపీడీఓ ఎ.రాజు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జేవీ ప్రకాష్‌బాబు తదితరులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. అంబాజీపేటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మందపాటి కిరణ్‌కుమార్, దొమ్మేటి సత్యమోహన్, పీకే రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకూడదు

అంబాజీపేట: నివాస ప్రాంతాల మధ్య ఉన్న డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం వల్ల దోమల ఉధృతి తగ్గుతుందని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం మాచవరంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీహెచ్ఓ బి.అప్పారావు మాట్లాడుతూ మురుగు కాలువలను శుభ్రం చేసుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తే దోమలు వృద్ధి చెంది పెరిగిపోతాయన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పారిశుధ్య పనులు చేసుకోవాలన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని కంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి రోగాలు వచ్చిన వారు అలసత్వం వహించకుండా జాగ్రత్తలు తీసుకుంటే కంటి చూపు కోల్పోరన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

‘సాక్షి’ పై కక్ష సాధింపు తగదు

- సాక్షి పత్రిక సంపాదకులు, విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి
- ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

కొత్తపేట: పల్నాడు జిల్లాలో జరిగిన సంఘటనలకు సంబంధించి ‘సాక్షి’ ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు ఆరుగురు విలేకరులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యుడు, కొత్తపేట ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో తహసీల్దార్ వై.రాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ‘సాక్షి’ సంపాదకులు, విలేకరులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యగా అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా ఉన్న పత్రికా వ్యవస్థపైన, విలేకరులపైన అమానుషంగా దాడులు జరపడం, కేసులు నమోదు చేయడం దారుణమని అన్నారు. ముఖ్యంగా ‘సాక్షి’పై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం ప్రభుత్వ వ్యతిరేక ధోరణికి అద్దం పడుతుందన్నారు. అన్యాయంగా, అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ జగతా రాంబాబు, సభ్యుడు అడపా ప్రసాద్, కొత్తపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి జితేంద్ర, కోశాధికారి శ్రీఘాకోళ్లపు బాబి, సభ్యులు చోడపునీడి ఏసు, బొరుసు సాయి తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం తహసీల్దార్ ముక్తేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు


కొత్తపేటలో తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న విలేకరులు

కేసులు ఉపసంహరించుకోవాలి

రావులపాలెం: సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు ‘సాక్షి’ పాత్రికేయులపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం రావులపాలెం మండల పాత్రికేయులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని, నిజాలను నిర్భయంగా ప్రచురిస్తూ పనిచేస్తున్న ‘సాక్షి’పై ప్రభుత్వం కక్ష సాధించడం తగదన్నారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కె.ఆదినారాయణ రెడ్డి, గొల్లపల్లి రాజశేఖర్, కొల్లి బాలు, కోనాల రాజ్ కుమార్, కొవ్వూరి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరులో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న విలేకరులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

అక్రమ కేసును ఉపసంహరించు కోవాలి

ఆలమూరు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ప్రజాదరణ పొందిన ‘సాక్షి’ దినపత్రికకు చెందిన ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా నమోదు చేసిన కేసును సత్వరమే ఉపసంహరించుకోవాలని ఆలమూరు ప్రెస్ క్లబ్ డిమాండ్ చేసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు శుక్రవారం చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను ఎత్తిచూపుతూ నిజాలను నిర్భయంగా ప్రశ్నిస్తూ, వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తున్న మీడియా రంగంపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని విమర్శించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం తహసీల్దార్ కేజే.ప్రకాష్ బాబుకు ప్రెస్ క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మండల జర్నలిస్టులు నామాల ఏసురాజు, లంకలపల్లి ఫణి చౌదరి, జీవీ రాజు, సుంకర శ్రీనివాస్, మూరా మణి రాజు, కె.పూర్ణ రెడ్డి, బూసి చిట్టికుమార్, గానుగుల పెద్ద తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు ఎంతో ప్రయోజనకరం

రావులపాలెం: ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెట్ కంపెనీ ప్రతినిధులు మండలంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉద్యానశాఖ సహకారంతో కంపెనీ రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా ప్రచార ర్యాలీ నిర్వహించినట్టు ఏజీఎం పి.వీరభద్రరావు తెలిపారు. మండలంలోని గోపాలపురం, పొడగట్లపల్లి, లక్ష్మీపోలవరం ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగుచేయడం వలన రైతులకు కలిగే ఉపయోగాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. అలాగే వివిధ నినాదాలతో ఆయిల్ పామ్ విశిష్టతను ప్రచారం చేశారు. కార్యక్రమంలో కంపెనీ ఏజీఎం పి.వీరభద్రరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.కృష్ణంరాజు, ఫీల్డ్ అధికారి బి.వెంకటేశ్వరరావు, ఉద్యానశాఖ వీహెచ్ఏ కల్యాణ, వీహెచ్ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు శాశ్వత స్థలం ఇవ్వాలి


గెద్దాడ శ్మశానవాటిక వివాదంపై చర్చిస్తున్న జేసీ, ఆర్డీఓ తదితరులు

మామిడికుదురు: బైపాస్ రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న శ్మశాన వాటికకు ప్రత్యామ్నాయంగా శాశ్వత స్థలం ఇవ్వాలని గెద్దాడ గ్రామస్తులు కోరారు. గెద్దాడ గ్రామంలో జేసీ నిశాంతి, ఆర్డీఓ మాధవి శుక్రవారం పర్యటించారు. స్థానికుల శ్మశానవాటిక సమస్యపై చర్చించారు. గతంలో ప్రైవేటు స్థలం 1.10 ఎకరాలు సేకరించి దాన్ని శ్మశాన వాటికకు ఇవ్వాలని నిర్ణయించడం దానిపై కోర్టు అభ్యంతరాలు ఉండడంతో ఇక్కడ సమస్య ఏర్పడింది. కోర్టు వివాదం పరిష్కారం కాగానే శాశ్వత స్థలం ఇస్తామని, ఇప్పటి వరకు తాత్కాలిక స్థలం ఇస్తామని చెప్పారని స్థానికులు తెలిపారు. దీనికి తాము సుముఖత చూపలేదన్నారు. స్థల పరిశీలనకు వచ్చిన వారికలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆచార్యులు, డీటీ శరణ్య, స్థానికులు గుబ్బల నాగరాజు, చిట్టూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాల ప్రచార జాత

రాజోలు: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాలు పురస్కరించుకుని చేపట్టిన ప్రచార జాత శుక్రవారం రాజోలు, తాటిపాక సెంటర్‌కు చేరుకుంది. తాటిపాకలో ప్రచారజాతను సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. తాటిపాక, రాజోలు, శివకోడు గ్రామాల మీదుగా మలికిపురం, గొంది, సఖినేటిపల్లిలో జాత కొనసాగింది. గత నెల23వ తేదీ భగత్ సింగ్ వర్ధంతి నుంచి వచ్చే 14న అంబేడ్కర్ జయంతి వరకు రాజోలు నియోజకవర్గంలో ప్రచార జాత జరుగుతుందని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ శత వసంతాల ప్రచార జాతాలో భాగంగా మండలంలో ఆ పార్టీ నాయకులు రాజ్యాంగంపై విస్తృత ప్రచారం చేశారు. స్థానిక మూడు తూములు సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అక్కడ నుంచి గొంది గ్రామంలో అమరవీరుల స్తూపం వద్ద జాతాను ముగించారు. జాతాలో నాయకులు మాట్లాడుతూ, పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఆక్వారంగాన్ని ఆదుకోవాలని, దేవస్థానం రైతుల శిస్తులు పెంచవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



రాజోలులో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు సత్తిబాబు


సంపూర్ణ పారిశుధ్య చర్యలు నెలకొల్పాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల రథసారథులు వీరే..


ముత్యాల వీరభద్రరావు


దొమ్మేటి అర్జునరావు


తమ్మన శ్రీనివాస్

కొత్తపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం కొత్తపేట నియోజకవర్గంలో ఆ పార్టీ మండల శాఖల అధ్యక్షులను ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి సిఫారసు మేరకు నియమితులైన పార్టీ మండల సారథుల వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట మండలానికి ముత్యాల వీరభద్రరావు, రావులపాలెం మండలానికి దొమ్మేటి అర్జునరావు, ఆత్రేయపురం మండలానికి కనుమూరి శ్రీనివాసరాజు, ఆలమూరు మండలానికి తమ్మన శ్రీనివాస్‌లు మరలా నియమితులయ్యారు.

ప్రమాద బాధితుడికి సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ కంటిలో ఊచ గుచ్చుకుని కంటి చూపు పోగొట్టుకున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన నామాడి నగేష్ రావులపాలెం సీఆర్‌సీ క్లబ్‌లో పని చేస్తున్నాడు. కొద్ది రోజులు క్రితం ఇంటి దగ్గర మేడ పైన ప్రమాదవశాత్తూ కంటిలో ఇనుప ఊచ గుచ్చుకుని తీవ్రగాయమైంది. ఆపరేషన్ చేశారు. అయినా కన్ను కనపడక పనికి వెళ్లలేని పరిస్థితి. వైద్యానికి ఖర్చు పెట్టాల్సి అతనిది దీంతో ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సభ్యులు మూలస్థానం వెళ్లి నగేష్ కి రూ.11 వేల చెక్కు, 25 కేజీ బియ్యం బస్తా అందజేశారు.